సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 1 । మార్చి । 2023



మండలి పోరు ఏకపక్షమే

గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.57,310
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,119
3 శాతం జీఎస్టీతో	రూ.5,273
నవర (8 గ్రా)	రూ.42,184

గరిష్టం/కనిష్టం
33.0 /22.4

వాతావరణం

మంగళవారం గాలిలో 68 శాతం తేమ ఉంది. జిల్లాలో పగలు వేడి వాతావరణం ఉంది. బుధవారం వాతావరణంలో ఎలాంటి మార్పు ఉండదు.

న్యూస్‌రీల్

నెల్లూరులో అసెంబ్లీ స్పీకర్



నెల్లూరు(అర్బన్): రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారామ్ మంగళవారం నెల్లూరుకు విచ్చేశారు. ఆయన తిరుపతికి వెళ్తూ నెల్లూరులోని ఆర్‌అండ్‌బీ అతిథి భవనంలో కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు.

వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ నేడు

నెల్లూరు(పొగతోట): జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. మొత్తం 3,11,157 మంది లబ్ధిదారుల కోసం రూ.86.43 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. నగదు పంపిణీకి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామ, వార్డు వలంటీర్లు తెల్లవారుజాము నుంచే పెన్షన్ అందజేయనున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్



నెల్లూరు(టౌన్): జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మంగళవారం జిల్లా వ్యాప్తంగా 213 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జనరల్‌కు సంబంధించి 3,662 మందికి గానూ 3,584 మంది హాజరయ్యారు. 78 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 789 మందికి గానూ 746 మంది విద్యార్థులు హాజరయ్యారు. 43 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జనరల్‌కు సంబంధించి 3,312 మందికి గానూ 3,260 మంది హాజరుకాగా 52 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్లో 765 మందికి గానూ 725 మంది హాజరయ్యారు. 40 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆర్‌ఐఓ వరప్రసాద్‌రావు నాలుగు, డీవీఈఓ మధుబాబు పది, హైపవర్ కమిటీ సభ్యులు ఆరు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు 26 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

నేటి నుంచి ఉచిత బియ్యం, రేషన్ సరుకుల పంపిణీ

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని 7,22,263 మంది రేషన్ కార్డుదారులకు బుధవారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తామని డీఎస్‌ఓ టి.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్డులోని ఒక్కో సభ్యునికి ఐదు కిలోల చొప్పున బియ్యం, ఇంకా ఒక కేజీ కందిపప్పు రూ.67కు, అర కిలో చక్కెర రూ.17కు అందిస్తామన్నారు. అంత్యోదయ అన్నయోజన కార్డుదారులకు 35 కిలోల బియ్యాన్ని ఉచితంగా అందించడంతోపాటు కిలో చక్కెరను రూ.13.50కు, కిలో కందిపప్పు రూ.67కు పంపిణీ చేస్తామన్నారు. ఈ సరుకులను 1,513 చౌకదుకాణాల ద్వారా 438 మొబైల్ వాహనాలతో ఇంటి వద్దే ఉదయం 7 నుంచి సాయంత్రం 8 గంటల వరకు అందజేయనున్నట్లు తెలియజేశారు.



నెల్లూరు బ్యారేజీ (ఫైల్)



సంగం బ్యారేజీ(ఫైల్)

మన బ్యారేజీలకు అవార్డుల పంట

నెల్లూరు, సంగం బ్యారేజీలతో రైతులకు భరోసా

- వాటి నిర్మాణాలను పట్టించుకోని గత టీడీపీ ప్రభుత్వం
- చిత్తశుద్ధితో పూర్తి చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- నెరవేరిన దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయం
- బ్యారేజ్‌లకు ప్రతిష్టాత్మక సీబీఐపీ అవార్డులు
- ఈనెల 3న అందుకోనున్న అధికారులు



నెల్లూరు, సంగం బ్యారేజీలు.. జిల్లా రైతాంగానికి ఇవి ఎంతో కీలకం. లక్షలాది ఎకరాలకు సాగునీరందించే ఈ ప్రాజెక్టుల నిర్మాణంపై గత టీడీపీ ప్రభుత్వం పూర్తి శ్రద్ధ పెట్టలేదు. తూతూమంత్రంగా పనులు చేయించింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేసి వేగంగా పనులు చేయించారు. దీంతో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయం నెరవేరింది. ప్రభుత్వ చిత్తశుద్ధికి ప్రతిష్టాత్మక సీబీఐపీ అవార్డులు వరించాయి. దీనిపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

సాక్షి, ప్రతినిధి నెల్లూరు: జిల్లాలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీ, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి నెల్లూరు బ్యారేజీలు ప్రతిష్టాత్మక సీబీఐపీ అవార్డులకు ఎంపికయ్యాయి. దీని వెనుక వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ కృషి ఎంతో ఉంది. జలయజ్ఞంలో భాగంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ బ్యారేజీలకు శ్రీకారం చుట్టారు. ఆయన హయాంలో పనులు శరవేగంగా జరిగాయి. వైఎస్సార్ హఠాన్మరణంతో ప్రాజెక్టుల పనులు నిలిచిపోయాయి. తర్వాత వచ్చిన పాలకులు కమీషన్లకు పరిమితమై అభివృద్ధిని విస్మరించారు. అంతంతమాత్రంగానే పనులు జరిగాయి. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక కరోనా లాంటి ప్రతికూల పరిస్థితులను అధిగమించి బ్యారేజీ పనుల్లో వేగం పెంచారు. నిర్మాణాలను పూర్తి చేసి 2022 సెప్టెంబర్ 6వ తేదీన జాతికి అంకితం చేశారు. దీంతో పెన్నా డెల్టాలోని 2.47

బ్యారేజీ	నీటి నిల్వ సామర్థ్యం
నెల్లూరు	0.4 టీఎంసీలు
సంగం	0.45 టీఎంసీలు

లక్షలు, కనుపూరు కాలువ కింద 63 వేలు, కావలి కాలువ కింద 75 వేలు మొత్తంగా 3.85 లక్షల ఎకరాల ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందించేందుకు మార్గం ఏర్పడింది. మరోవైపు పెన్నా నదికి వచ్చే వరదలను సమర్థవంతంగా నియంత్రించి, ముంపు ముప్పునకు శాశ్వత పరిష్కారం దక్కింది. నెల్లూరు బ్యారేజీ ద్వారా సర్వేపల్లి, కోవూరు, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల పరిధిలో 99,525 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు అవకాశం కలిగింది.

బహుళ ప్రయోజనాలు

పెన్నార్ డెల్టాలో 2019–20, 2020–21లో భూగర్భ జలమట్టం 5.82 మీటర్లు ఉండేది. సంగం, నెల్లూరు బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయడం వల్ల పెన్నా డెల్టాలో 0.8 మీటర్లలోనే భూగర్భ జలాలు పుష్కలంగా లభ్యమవుతున్నాయి. భూగర్భ జలాలు పెరగడంతో సముద్రతీరం ఉన్న నెల్లూరు జిల్లాలో పెన్నా డెల్టాలో ఉప్పునీరు చేరకుండా అడ్డుకట్ట పడింది. భూములు సారవంతంగా మారాయి. పెన్నా డెల్టా ఆధునికీకరణ వల్ల ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా పెరిగాయి.

గుర్తింపు

దేశంలో నీటి వనరులు, విద్యుత్, సంప్రదాయేతర ఇంధన వనరుల విభాగంలో అత్యుత్తమ ప్రాజెక్టులను గుర్తించి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సీబీఐపీ (సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్) అవార్డులను ప్రదానం చేసి ప్రోత్సహిస్తోంది. ఈ అవార్డు దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైందిగా భావిస్తారు. పెన్నా డెల్టా ఆధునికీకరణలో భాగంగా నెల్లూరు, సంగం బ్యారేజీలను పూర్తి చేసి యాజమాన్య పద్ధతుల ద్వారా నీటి వృథాకు అడ్డుకట్ట వేసి లక్షలాది ఎకరాలకు సమర్థవంతంగా నీటిని అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ సీబీఐపీ ప్రశంసించింది. రెండు బ్యారేజీలను సీబీఐపీ అవార్డు–2022కు ఎంపిక చేసింది. ఈనెల 3వ తేదీన సీబీఐపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో



బ్యారేజీ ప్రారంభోత్సవంలో సీఎం జగన్ (ఫైల్)

నిర్వహించే కార్యక్రమంలో కలెక్టర్ కేవీఎన్ చక్రధర్ బాబు, జలవనరుల శాఖలోని తెలుగుగంగ చీఫ్ ఇంజినీర్ తిరుపతికి చెందిన ఎం.శ్రీనివాసులురెడ్డి, ఎన్టీఆర్ తెలుగుగంగ మాజీ చీఫ్ ఇంజినీర్ కె.హరి నారాయణరెడ్డి అవార్డులను కేంద్ర విద్యుత్, సంప్రదాయేతర, ఇంధనవనరులు శాఖ మంత్రి ఆర్కే సింగ్ చేతుల మీదుగా అందుకోనున్నారు. దీనిపై జిల్లా వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పలు అవార్డులు

వైఎస్సార్‌సీపీ పాలనలో ఇప్పటికే జిల్లాకు అనేక అవార్డులు వచ్చాయి. ప్రభుత్వ పారదర్శక పాలనకు అధికారుల చిత్తశుద్ధి తోడవడంతో జిల్లాకు జాతీయ స్థాయిలో కీర్తి లభిస్తోంది. బెస్ట్ మెరైన్ డిస్ట్రిక్ట్, ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన (పీఎంఏజీవై) పథకం అమలుకు సంబంధించిన అవార్డు, సఫాయీ మిత్ర సురక్ష చాలెంజ్ పురస్కారం, ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాల అమలుపై, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకం అమలుకు సంబంధించిన అవార్డులు లభించాయి.

అందరి సహకారంతోనే..



జిల్లాలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు సహకారం అందించడంతోనే జాతీయ, రాష్ట్రస్థాయిలో అవార్డులు లభించాయి. సమష్టి కృషితోనే అవార్డులు సాధించగలిగాం.

– కేవీఎన్ చక్రధర్‌బాబు, కలెక్టర్

రాళ్లపాడు ప్రాజెక్టు పరిశీలన



ప్రాజెక్టు వద్ద సీఈ తదితరులు

- సీఈ మురళీనాథ్‌రెడ్డి

లింగసముద్రం: మండలంలోని రాళ్లపాడు ప్రాజెక్టును సీఈ మురళీనాథ్‌రెడ్డి మంగళవారం ప్రకాశం జిల్లా ఎస్‌ఈ లక్ష్మీరెడ్డితో కలిసి పరిశీలించారు. పాత స్పిల్‌వే, కొత్త స్పిల్‌వే గేట్లను చూశారు. నీటి నిల్వ సామర్థ్యం, కుడి, ఎడమ కాలువలకు ఎన్ని క్యూసెక్కులు విడుదలవుతుందని డీఈలు లక్ష్మీనారాయణ, హజరత్తయ్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సంవత్సరంలో ప్రాజెక్టుల కింద ఏ పంటలు వేశారని అడగ్గా.. ఆలస్యంగా ప్రాజెక్టు నిండటంతో వరిపంట కొంత మంది రైతులు మాత్రమే నాటారని, ఎక్కువ విస్తీర్ణంలో పత్తి పంటను ఆయకట్టు కింద సాగు చేశారని అధికారులు వివరించారు. సోమశిల జలాలు ఎప్పటి నుంచి వస్తున్నాయి?, ఈ ఏడాది ఎంత నీరు ప్రాజెక్టుకు చేరిందో వివరించారు. ఇన్‌టేక్‌వెల్ ద్వారా మూడు భారీ మంచి నీటి పథకాల నుంచి లింగసముద్రం, వలేటివారిపాళెం, గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లోని 114 గ్రామాలకు మంచి నీటిని అందిస్తున్నట్లు చెప్పారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నీటిని అందించాలని సీఈ ఆదేశించారు. ఆయన వెంట జేఈలు చంద్రమౌళి, పూర్ణచంద్రరావు ఉన్నారు.

సోమశిలలో 61.459 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో మంగళవారానికి 61.459 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 135 క్యూసెక్కుల వంతున నీరు వచ్చి చేరతున్నాయి. జలాశయం నుంచి పెన్నార్ డెల్టాకు 2,000 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 703, దక్షిణకాలువకు 400, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 98.247 మీటర్ల మట్టం నమోదైంది. సగటున 362 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతోంది.

శనగల కొనుగోళ్లకు రిజిస్ట్రేషన్స్

- నేటి నుంచి ఆర్బీకేల్లో..



నెల్లూరు(సెంట్రల్): శనగల కొనుగోళ్లకు సంబంధించి బుధవారం నుంచి రైతు భరోసా కేంద్రాల్లో పంట వివరాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మార్క్‌ఫెడ్ జిల్లా అధికారి పవన్‌కుమార్ అన్నదాతలకు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. సుమారు 17 వేల ఎకరాల్లో సాగు చేసినట్లు గుర్తించామని, 11 వేల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి కొనుగోలు ప్రారంభమవుతుందన్నారు. ఆత్మకూరు, దుత్తలూరు, కందుకూరు, లింగసముద్రం, కలిగిరి, వింజమూరు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పంట పండించిన రైతులు గడువులోగా ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్స్ చేయించుకోవాలని తెలియజేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు వేగంగా ఏర్పాట్లు

- రిటర్నింగ్ అధికారి హరినారాయణన్
- ఎన్నికల ఏఆర్వోలైన డీఆర్వో, ఆర్డీఓలతో సమీక్ష



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి హరినారాయణన్

సాక్షి, చిత్తూరు: ఉమ్మడి ప్రకాశం – నెల్లూరు – చిత్తూరు జిల్లాలకు సంబంధించి టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు వేగంగా ఏర్పాట్లు చేయాలని చిత్తూరు కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎం.హరినారాయణన్ సూచించారు. ఆయా జిల్లాల్లోని ఎన్నికల ఏఆర్‌ఓలైన డీఆర్వో, ఆర్డీఓలతో మంగళవారం చిత్తూరు నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 13వ తేదీన ఎన్నికలను పక్కాగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సెక్టోరల్, ప్రిసైడింగ్ అధికారులు, ఇతర ఎన్నికల సిబ్బంది, కౌంటింగ్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలను పూర్తి చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్లలో అవసరమైన సదుపాయాలను కల్పించాలన్నారు. ఆర్డీఓలు ప్రతి పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించాలని ఆదేశించారు. అవసరమైన ఏర్పాట్లను చేయించాలన్నారు. 9వ తేదీ నాటికి పోలింగ్ కోసం అవసరమైన సామగ్రిని సిద్ధం చేయాలన్నారు. బ్యాలెట్ బాక్స్‌ల నాణ్యతను కచ్చితంగా పరిశీలించాలన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, కౌంటింగ్ సెంటర్ల వద్ద ప్రతి అంశాన్ని చూడాలన్నారు. ఓటర్ స్లిప్‌లను బీఎల్వోల సహాయంతో అందజేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఎస్.వెంకటేశ్వర్లు, చిత్తూరు డీఆర్వో ఎస్.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసన్న వేంకటేశ్వరస్వామి

ప్రసన్నుడికి బ్రహ్మోత్సవ శోభ

- రేపటి నుంచి 8వ తేదీ వరకు..
- బిలకూట క్షేత్రంలో ముమ్మరంగా ఏర్పాట్లు
- 7న ఉదయం కల్యాణోత్సవం, సాయంత్రం రథోత్సవం



కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం

బిట్రగుంట: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండ బిట్రగుంట బిలకూట క్షేత్రంలో గురువారం నుంచి ప్రసన్నుని వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. క్షేత్రవాసి ప్రసన్న వేంకటేశ్వర స్వామికి వైఖానస ఆగమశాస్త్రానుసారం ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ దశమి నుంచి బహుళ పాడ్యమి వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఈనెల 2 నుంచి 8వ తేదీ వరకూ ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. భక్తుల పాలిట ప్రసన్నుడిగా, ఆపద మొక్కులవాడిగా పేరొందిన స్వామిని ఉత్సవాల్లో దర్శించి, తరించేందుకు ఏటా లక్షలాది మంది భక్తులు తరలి వస్తారు. ప్రధాన ఘట్టాలైన గరుడసేవ, మొక్కుబడులు, కల్యాణోత్సవం రోజుల్లో బిలకూట క్షేత్రం భక్తజన సంద్రంగా మారుతుంది.

విస్తృత ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. భక్తుల కోసం పెద్ద చలువ పందిళ్లు, చలివేంద్రాలు సిద్ధమయ్యాయి. తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానపు గదులు వేగంగా నిర్మించారు. దేవేరులతో కూడిన స్వామి విద్యుత్ కటౌట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల రాకపోకలకు అనుగుణంగా రవాణా సౌకర్యాలు మెరుగుపరిచారు. భక్తుల భద్రత, పారిశుద్ధ్యం, వైద్య సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు అధికారులతో స్వయంగా సమీక్షిస్తున్నారు. ఉత్సవాలు జరిగినన్ని రోజులు నిత్యాన్నదానం నిర్వహించేందుకు కొండ దిగువన ఉన్న వివిధ సత్రాల నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఏ రోజు ఏ ఉత్సవం?

2న గిరిప్రదక్షిణ, అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. 3న తిరుమంజనం, ధ్వజారోహణ (కొడిముద్దలు), శేషవాహన సేవ, 4న హనుమంతసేవ, 5వ తేదీన ఉదయం మోహినీ ఉత్సవం, రాత్రికి గరుడసేవ, 6వ తేదీన ఉదయం మొక్కుబడులు, సాయంత్రం తెప్పోత్సవం, రాత్రికి గజవాహన సేవ, 7వ తేదీన ఉదయం కల్యాణోత్సవం, సాయంత్రం రథోత్సవం, రాత్రికి అశ్వవాహన సేవ, 8వ తేదీన సాయంత్రం పుష్పయాగం జరుగుతాయి. రాత్రికి ఏకాంతసేవతో ఉత్సవాలు పూర్తవుతాయి. రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

వైభవంగా ఉత్సవాలు

ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. స్వామి దర్శనానికి వచ్చే ప్రతిఒక్కరూ ప్రశాంత వాతావరణంలో స్వామిని దర్శించుకుని చక్కటి అనుభూతి పొందేలా చర్యలు చేపడుతున్నాం. ఎమ్మెల్యే రామిరెడ్డి కూడా ఉత్సవాల ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

– శ్రీరాం మాల్యాద్రి, ఆలయ కమిటీ చైర్మన్

క్లుప్తంగా

గాయపడిన పూజారి మృతి



మర్రిపాడు : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుదర్శన్(35) అనే ఆలయ పూజారి మంగళవారం మృతిచెందినట్లు గ్రామస్తులు వెల్లడించారు. వారి కథనం మేరకు.. మండలంలోని కదిరినాయుడుపల్లి గ్రామంలో సుదర్శన్ ఆలయ పూజారిగా ఉన్నారు. మూడు రోజుల క్రితం బద్వేల్‌కు బైక్‌పై వెళ్తుండగా బద్వేల్ సమీపంలోని సుదర్శన్ ఆశ్రమం ఎదురుగా ఓ బస్సును తప్పించే క్రమంలో అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో సుదర్శన్‌ను కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన స్వగ్రామం నంద్యాల జిల్లాలోని కోవెలకుంట్ల కాగా మర్రిపాడు మండలంలోని కదిరినాయుడుపల్లిలో ఆలయ పూజారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బెదిరించి.. మెషీన్‌ను లాక్కొని

వెంకటాచలం : తాము అటవీశాఖ ఉద్యోగులమని. అనుమతుల్లేకుండా చెట్లను ఎలా కట్ చేస్తావని బెదిరించి కటింగ్ మెషీన్‌ను లాక్కెళ్లడంతో బాధితుడు చెంచయ్య వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన చెముడుగుంట పంచాయతీ బురాన్‌పూర్ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. కాకుటూరు గ్రామానికి చెందిన చెంచయ్య చెట్లు కటింగ్ చేసే మెషీన్ను కొనుగోలు చేసి తద్వారా జీవనం సాగించేవాడు. కాగా బురాన్‌పూర్ వద్ద చెట్లను కటింగ్ చేస్తుండగా, ముగ్గురు యువకులు వచ్చి, మా అనుమతి లేకుండా చెట్లు కటింగ్ చేస్తావా.. అని బెదిరించి కటింగ్ మెషీన్ను లాక్కొని వెంకటాచలం పోలీస్ స్టేషన్ వద్దకు రావాలని వెళ్లిపోయారు. బాధితుడు వెంకటాచలం పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకోగా, ఎంతసేపటికీ ముగ్గురు వ్యక్తులు కనిపించకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



హఫీజ్ మృతదేహం

కావలి రూరల్ : అప్పుల బాధ తాళలేక సయ్యద్ హఫీజ్(34) అనే వ్యక్తి తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఒకటో పట్టణ పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు నగరంలోని డైకస్ రోడ్డుకు చెందిన సయ్యద్ హఫీజ్‌కు భార్య, ఐదేళ్ల బాబు సంతానం. అతను పనినిమిత్తం కావలిలోని ఇస్లాంపేటలో ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. పట్టణంలోని ఓ దుకాణాన్ని అద్దెకు తీసుకుని బైక్ మెకానిక్, లేత్‌వర్క్ చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే ఈ మధ్య కాలంలో అప్పులు పెరిగిపోవడంతో తరచూ బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి హఫీజ్‌ను ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు కింద పడి..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

కావలి రూరల్ : రైలు కింద పడి కామేపల్లి వెంకటరావు(19) అనే యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం మద్దూరుపాడు వద్ద రైలు పట్టాలపై వెలుగుచూసింది. రైల్వే ఎస్సై అరుణకుమారి తెలిపిన సమాచారం మేరకు.. కొండాపురం మండలం, కోవివారిపల్లి గ్రామానికి చెందిన కామేపల్లి రమణయ్య, వెంగమ్మలకు కుమారుడు వెంకటరావు, కుమార్తె సంతానం. తల్లిదండ్రులు హైదరాబాద్‌లో బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తారు. కుమారుడు కామేపల్లి వెంకటరావు డిప్లొమా వరకు చదివి వింజమూరులోని ఓ ప్రైవేట్ మెడికల్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కాగా మంగళవారం ఉదయం మద్దూరుపాడు వద్ద రైల్వే పట్టాలపై మృతి చెంది ఉండడంతో ట్రాక్‌మెన్ గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 98
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 180
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 200
లేయర్ చికెన్	: 128

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)




పెద్దవి	: రూ.82
సన్నవి	: రూ.70
పండ్లు	: రూ.40

రైలుపట్టాలు దాటడం చట్టరీత్యా నేరం

- ప్రమాదాలు, నేరాలపై విస్తృత అవగాహన కల్పించాలి
- రైల్వే డీఎస్పీ పి.మల్లికార్జునరావు

నెల్లూరు(క్రైమ్) : రైలు పట్టాలపై వెళ్తూ అనేక మంది మృత్యువాత పడుతున్నారని, పట్టాలను దాటడం చట్టరీత్యా నేరమనే విషయంపై ప్రయాణికులకు విస్తృత అవగాహన కల్పించాలని నెల్లూరు రైల్వే డీఎస్పీ పి.మల్లికార్జునరావు సిబ్బందిని ఆదేశించారు. నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్, ఆత్మకూరు రైల్వే బ్రిడ్జి, నక్కలోళ్ల సెంటర్ తదితర ప్రాంతాలను ఆయన తన సిబ్బందితో కలిసి మంగళవారం రాత్రి పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణ, వేసవి సమీపిస్తున్న దృష్ట్యా రైళ్లలో నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్లాట్‌ఫారమ్‌పై విధులు నిర్వహించే సిబ్బంది పట్టాలు దాటే ప్రయాణికులకు అవగాహన కల్పించి ప్రమాదాలను నిరోధించాలని సూచించారు. అనంతరం నెల్లూరు రైల్వే పోలీసుస్టేషన్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కదిలే రైలు నుంచి దిగడం, ఎక్కడం, ఫుట్‌పాత్ ప్రయాణం ప్రమాదకరమన్నారు. ఫుట్‌పాత్‌ల నుంచి కాకుండా పట్టాల మీదుగా ప్లాట్‌ఫారాలకు వెళ్లడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, హెడ్‌ఫోన్స్‌లో పాటలు వింటూ రైలుపట్టాలు దాటడం, వంతెనల మీదుగా రాకపోకలు సాగించడం, మలుపుల వద్ద అప్రమత్తంగా ఉండకుండా రైలు పట్టాలపై రాకపోకలు సాగించడం ప్రమాదాలకు కారణాలన్నారు. ఒక ప్లాట్‌ఫారమ్ నుంచి మరో ప్లాట్‌ఫారమ్‌కు వెళ్లేవారు విధిగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జి లేదా ఎక్స్‌లేటర్‌ను వినియోగించుకోవాలన్నారు. ఫుట్‌పాత్‌లు లేని వంతెనల మీదుగా రాకపోకలు సాగించడం మృత్యువుకు ఎదురెళ్లడమేనన్న విషయాన్ని గుర్తించుకుని వాటిని విరమించుకోవాలన్నారు. ఆత్మకూరు బస్టాండ్ రైల్వేబ్రిడ్జిపై నడిచే ప్రయాణికులపై ఇండియన్ రైల్వే యాక్ట్ సెక్షన్ 147 ప్రకారం రూ.1000 అపరాధ రుసుం లేదా ఆరు నెలలు జైలుశిక్ష విధించే అవకాశం ఉందన్నారు. ప్రయాణ సమయంలో సాధ్యమైనంత మేరకు విలువైన వస్తువులను తీసుకెళ్లరాదని, వస్తువుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా రైల్వే టోల్ ఫ్రీ నంబర్‌లు 139, 182కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని సూచించారు. ఆయన వెంట రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి, ఆర్పీఎఫ్ సీఐ వసంతరావు, నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను పరిశీలిస్తున్న డీఎస్పీ మల్లికార్జునరావు



సిబ్బందికి, వెండర్లకు సూచనలిస్తున్న రైల్వే డీఎస్పీ

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఏపీఎంఐపీ జిల్లా డైరెక్టర్ శ్రీనివాసులు



డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న ప్రాజెక్ట్ జిల్లా డైరెక్టర్

కావలి రూరల్ : ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలు, సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపీ(ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ (ప్రాజెక్ట్) జిల్లా డైరెక్టర్ డి.శ్రీనివాసులు తెలిపారు. కావలి రూరల్ మండలంలోని చెన్నాయిపాళెం పంచాయతీలో రైతులకు అందించిన డ్రిప్ పరికరాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు చేయూతనివ్వాలనే ఆశయంతో బిందు తుంపర సేద్యానికి 90 శాతం రాయితీలు ఇస్తోందన్నారు. రైతులు డ్రిప్ పరికరాలను అమర్చుకుని ఉద్యానవన పంటలను సాగు చేసుకుంటూ తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందాలన్నారు. అనంతరం రైతులకు డ్రిప్ పరికరాలపై పలు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ ఇంజినీర్స్ ఎ.బాలజీరెడ్డి, ఫినోలెక్స్ డీసీఓ సీహెచ్.శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్ సీహెచ్ వెంకటకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

డాక్టర్ నిర్లక్ష్యంపై వాగ్వాదం



సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న బాధితులు

ఆత్మకూరు : ఓ చిన్నారికి ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో వైద్యం చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం తరలించే క్రమంలో చికిత్స వివరాలు ఇవ్వకపోవడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. గతనెల 22వ తేదీన సుహాన అనే 11 ఏళ్ల బాలికను తల్లిదండ్రులు అబ్దుల్ కలాం, రసూల వైద్యం కోసం ఆస్పత్రిలో చేర్చారు. తీవ్ర కడుపునొప్పి రావడంతో అపెండిసైటిస్ (24 గంటల కడుపునొప్పి) ఆపరేషన్ చేశారు. అనంతరం బాలికకు ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తీసుకెళ్లాలని చిన్నపిల్లల డాక్టర్ సూచించారు. వారిది పేద కుటుంబం కావడంతో పలువురి సహాయంతో చెన్నైకు తీసుకెళ్లారు. అయితే అక్కడ పరిశీలించిన వైద్యులు బాలికకు ఆత్మకూరు ఆస్పత్రిలో చేసిన ఆపరేషన్, వైద్యం వివరాలు తెలపాలని కోరడంతో బంధువులు తిరిగి చిన్నపిల్లల డాక్టర్‌ను అడిగారు. అయితే రెండు రోజుల పాటు చేసిన వైద్యం వివరాలు ఇవ్వకపోగా వారి పట్ల దురుసుగా వ్యవహరించాడని వారు ఆరోపించారు. దీంతో ఆస్పత్రి ప్రాంగణంలో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో సూపరింటెండెంట్ శేషారత్నం విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని బాధితులకు చెప్పడంతో వాగ్వాదం సద్దుమణిగింది. బాలిక పరిస్థితి విషమంగానే ఉందని బాధితులు పేర్కొన్నారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : అనారోగ్యం కారణంగా పురుగుల మందు సేవించి చికిత్స పొందుతున్న ముంగర జగదీష్ (36) అనే వ్యక్తి మంగళవారం ఉదయం మృతిచెందాడు. ఎస్సై ఆంజనేయులు కథనం మేరకు.. విడవలూరుకు చెందిన జగదీష్ గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ బాధలను తట్టుకోలేక అతను గతనెల 24వ తేదీన పురుగు మందు సేవించాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతన్ని నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగవారం ఉదయం మృతి చెందాడని ఎస్సై తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

మండలి పోరు ఏకపక్షమే

- ఊపుమీద వైఎస్సార్‌సీపీ, చతికిలపడ్డ టీడీపీ
- స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా మేరిగ మురళీ ఏకగ్రీవంతో బోణీ
- తాజాగా టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థికి ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం మద్దతు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు : ఎన్నిక ఏదైనా వైఎస్సార్‌సీపీ విజయదుందుభి మోగిస్తోంది. తాజాగా తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీల స్థానాలతో పాటు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. అయితే స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా మేరిగ మురళీధర్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఊపు కనిపిస్తోంది. ప్రజాసంక్షేమ పాలనతో ఆదరణ పొందిన వైఎస్సార్‌సీపీ స్థానిక ఎన్నికల నుంచి విజయాల పరంపరను కొనసాగిస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికలతో మరోసారి సత్తా చాటనుంది. తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల్లో సైతం జిల్లాలో అదే స్థాయిలో పట్టు బిగిస్తోంది. ఆ పార్టీ నేతలు ఇప్పటికే క్షేత్రస్థాయిలో ఓటర్లతో నేరుగా మమేకమవుతున్నారు. వ్యూహ ప్రతివ్యూహాలపై వైఎస్సార్‌సీపీ అగ్రనేతలు ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామస్థాయిలో కూడా గ్రాడ్యుయేట్ ఓటర్లతో మమేకమవుతున్నారు.

గ్రాడ్యుయేట్స్‌లో సైతం

తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ తరఫున పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి బరిలో ఉన్నారు. టీడీపీ తరఫున శ్రీకాంత్‌చౌదరి రంగంలో ఉన్నాడు. అయితే పేర్నాటిని రెండు నెలల ముందుగానే వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో ఆయన అప్పటి నుంచే గ్రాడ్యుయేట్ల మద్దతు కోరుతూ తిరుగుతున్నారు. అధికార పార్టీ అభ్యర్థి కావడంతో గ్రాడ్యుయేట్స్ కూడా ఆయన వైపే మొగ్గు చూపుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోవైపు ప్రజారంజక పాలనతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా కల్పిస్తున్నారు. గ్రామ వలంటీర్ల నుంచి గ్రామ సచివాలయ ఉద్యోగాలుగా ఎందరికో కొలువులు కల్పించారు. ఇంకో వైపు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. స్థానికులకే 75 శాతం ఉద్యోగాలంటూ ప్రభుత్వం నిబంధనలు పెట్టి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది. ఈ క్రమంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి వైపే యువత మొగ్గు చూపుతుంది. దీనికి తోడు క్షేత్రస్థాయిలో బలమైన కేడర్ ఉండడం కలిసొచ్చే అంశం.

టీచర్స్ నుంచి పెరుగుతున్న మద్దతు

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం ఇప్పటికే వైఎస్సార్‌సీపీ ఖాతాలో నమోదైంది. ఈ నేపథ్యంలో టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి అన్నివర్గాల నుంచి మద్దతు వెల్లువెత్తుతోంది. ప్రైవేట్ ఉపాధ్యాయుల మద్దతు బలంగా ఉండడంతో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా కలిసి రావడం శుభపరిణామంగా విశ్లేషకులు చెబుతున్నారు. అటు టీడీపీ మద్దతుతో ఎల్‌సీ రమణారెడ్డి, పీడీఎఫ్ బాబురెడ్డి బరిలో ఉన్నారు. గతంలో పీడీఎఫ్ తరఫున అభ్యర్థులు విజయం సాధించినా వారి వల్ల ఉపాధ్యాయులకు కలిగిన ప్రయోజనాలు ఒక్కటి కూడా లేవు. ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే తమ సమస్యలు పరిష్కరిస్తారన్న నమ్మకం ఉపాధ్యాయుల్లో వచ్చింది. చంద్రశేఖర్‌రెడ్డి ఇప్పటికే రెడ్‌క్రాస్ ద్వారా నిస్వార్థమైన సేవలు అందించిన గుర్తింపు పొందారు. దీంతో ఉపాధ్యాయ సంఘాలు ఒక్కటిగా వచ్చి మద్దతు ఇస్తున్నాయి. తాజాగా సోమవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం మద్దతు ప్రకటించింది. నగరంలోని ప్రైవేట్ హోటల్‌లో వీరు సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ ఉపాధ్యాయ అధ్యక్ష, కార్యదర్శులు బి.తిరుపాలు, తులసిదాస్ మద్దతు ప్రకటించారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- జేసీ కూర్మనాథ్



రికార్డులు పరిశీలిస్తున్న జేసీ కూర్మనాథ్

చేజర్ల : వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు– భూరక్ష పథకంలో భాగంగా చేపడుతున్న రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ తెలిపారు. మండలంలోని కోటితీర్థం, చేజర్ల, గొల్లపల్లి గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. అధికారులు చేపడుతున్న రీసర్వేను పరిశీలించారు. మొదట చెక్ పాయింట్‌లను తనిఖీ చేశారు. అనంతరం రైతులతో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. సత్వరమే రైతుల సమస్యలు పరిష్కరించి సర్వేను పూర్తి చేయాలన్నారు. స్వామిత్వ పథకం ద్వారా గ్రామాల్లో సాంకేతికతతో కూడిన సర్వే మ్యాపింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. దీని ద్వారా గ్రామాల్లో ఉండే స్థలాలకు ఆస్తి హక్కు పత్రాలను అందజేస్తామన్నారు.

సచివాలయాల తనిఖీ

చేజర్ల, మడపల్లి గ్రామ సచివాలయాలను జేసీ కూర్మనాథ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని ఆదేశించారు. తమకు న్యాయం చేయలేదని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ శివకృష్ణయ్య, ఉప తహసీల్దార్ విజయ్, రీ–సర్వే ఉప తహసీల్దార్ గిరీష్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చోరీ కేసులో కారు డ్రైవర్ అరెస్టు

- రూ.2.32 లక్షల సొత్తు స్వాధీనం

గుడ్లూరు : కారులో ఉంచిన నగదును అపహరించిన కేసులో డ్రైవర్ అన్సర్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రసాద్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఉలవపాడు మండలంలోని రామాయపట్నం గ్రామానికి చెందిన అన్సర్ అనే వ్యక్తి భార్య, పిల్లలతో కలిసి కావలిలోని కచ్చేరిమిట్టలో నివాసముంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నెల్లూరుకు చెందిన గౌస్‌బాషా అనే వ్యక్తికి చెందిన కారును కావలిలో అద్దెకు తిప్పుతుంటాడు. కాగా కావలి మండలం తుమ్మలపెంటకు చెందిన వాయల శ్రీను సొంత పనుల కోసం అన్సర్ వద్ద కారును అద్దెకు తీసుకుంటుంటాడు. ఇదే క్రమంలో గత నెల 23వ తేదీన శ్రీను అన్సర్‌తో కారును అద్దెకు మాట్లాడుకున్నాడు. కారును ఇంటికి పిలిపించుకుని రూ.2.5 లక్షల నగదును కారు డ్యాష్ బోర్డులో ఉంచి కావలికి వచ్చి అక్కడ నివాసముంటున్న గుడ్లూరు మండలం చిన లాటరఫి గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డిని ఎక్కించుకొని నరసాపురం మామిడితోట వద్దకు వెళ్లారు. శ్రీను, గోపాల్‌రెడ్డి మామిడి తోటలోకి వెళ్లగా డ్రైవర్ అన్సర్ డ్యాష్ బోర్డులో ఉన్న రూ.2.5 లక్షల నగదు తీసుకుని పక్కనే ఉన్న చెరువు దగ్గర చెట్లలో దాచి పెట్టాడు. మరలా కారు దగ్గరకు వచ్చి ఎవరికీ అనుమానం రాకుండా పేపర్లను కారులో వేసి తగులబెట్టాడు. అయితే భయంతో నగదును తీసుకొని అక్కడి నుంచి పరారయ్యాడు. శ్రీను కారు వద్దకు వచ్చి మంటలు ఆపి చూడగా డ్యాష్ బోర్డులో నగదు లేదని గుర్తించాడు. డ్రైవర్ కూడా లేకపోవడంతో నగదుతో పరారైనట్లు అనుమానించి అతని కోసం గాలించగా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సోమవారం రాత్రి అన్సర్ దొంగిలించిన నగదు సంచితో రామాయపట్నం రావడానికి అడవిలక్ష్మీపురం క్రాస్‌రోడ్డు వద్ద ఉన్నట్లు సమాచారం అందుకున్న ఎస్సై ప్రసాద్‌రెడ్డి అక్కడికి చేరుకుని అతన్ని అదుపులోకి తీసుకొని రూ.2.32 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. అన్సర్‌పై కేసు నమోదు చేసి కందుకూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో ఒంగోలు జైలుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

లారీ బోల్తా

- డ్రైవర్‌కు గాయాలు



సంగం: పంట కాలువలో లారీ బోల్తా పడి డ్రైవర్ గాయపడిన ఘటన మండలంలోని నెల్లూరు – ముంబై జాతీయ రహదారి పక్కన మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. లారీ యూరియా లోడుతో నెల్లూరు నుంచి బేతంచర్లకు బయలుదేరింది. ఈక్రమంలో మండలంలోని పెరమన సమీపానికి వచ్చే సరికి డ్రైవర్ మధు నిద్ర మత్తులో.. ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో లారీ అదుపుతప్పి పంట కాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. లారీలో ఇరుక్కున్న అతడిని వాహనదారులు బయటకు తీశారు. 108 అంబులెన్స్‌లో సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. సంగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.